క్లుప్తంగా

వేడుకగా ధ్వజస్తంభ ప్రతిష్ట



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని పురంధరపురం గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు చేసి, హోమాలు చేసి ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. కార్యక్రమానికి ఉభయదాతలుగా ఎర్ర విజయ్‌కుమార్‌రెడ్డి, ఉమామహేశ్వరి వ్యవహరించారు. రూ.15 లక్షలతో ధ్వజస్తంభం స్థాపన చేపట్టామని ఉభయకర్తలు తెలిపారు. ఆలయాభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని చెప్పారు.

అక్కంపేట ఎన్నిక రసాభాస

• హెచ్‌ఎం అస్వస్థతతో వాయిదా



హెచ్‌ఎంతో పేరెంట్స్ వాగ్వాదం

మనుబోలు : మండలంలోని అక్కంపేట ఎస్ఎస్ఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యా కమిటీ ఎన్నిక రసాభాసగా మారింది. ఈ ఎస్ఎంసీ ఎన్నికలో పాఠశాల కోరం మొత్తం మాజీ సర్పంచ్ నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డికి అనుకూలంగా ఉండడంతో అధికార పార్టీ అనుకూల వర్గం తాము గెలిచేందుకు అవకాశం లేకపోవడంతో హెచ్‌ఎంను అడ్డం పెట్టుకుని ఎన్నికను వాయిదా వేశారనే విమర్శలు వస్తున్నాయి. సభ్యులందరినీ పేరెంట్స్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోరం పూర్తయి అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక జరగాల్సి ఉండగా చివరి దశలో ఇన్‌చార్జి హెచ్‌ఎం జీవదయామణి తనకు ఆరోగ్యం బాగా లేదంటూ హడావుడి చేయడంతో హఠాత్తుగా ఎన్నికను వాయిదా వేశారు. దీంతో హెచ్‌ఎం, అధికారులతో పేరెంట్స్ వాగ్వాదానికి దిగారు. వెంటనే ఎస్సై అజయ్‌కుమార్ రంగప్రవేశం చేసి ఇరు వర్గాలను అదుపు చేసి పరిస్థితిని చక్కదిద్దారు. హెచ్‌ఎంను చికిత్స నిమిత్తం 108లో తరలించారు. కాగా మండలంలో మొత్తం 53 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 52 పాఠశాలల విద్యా కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా ముగిశాయి.

కాండం తొలుచు పురుగును నివారించుకోండి



నార్తురాజుపాళెంలో వరిపంటను పరిశీలిస్తున్న ఏఓ

కొడవలూరు : వరి పంటను కాండం తొలుచు పురుగు ఆశించి ఉన్నందున నివారించుకోవాలని ఏఓ లక్ష్మి సూచించారు. మండలంలోని నార్తురాజుపాళెంలో సాగులో ఉన్న వరి పంటను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాండం తొలుచు పురుగు నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ రెండు గ్రాములను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. వరి పొట్టదశలో ఉన్నప్పుడు పొటాష్ వినియోగించాలని స్పష్టం చేశారు. ఏఓ వెంట వీఏఏ శివజ్ఞాన, రైతులు ఉన్నారు.

దోమపోటుపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

తోటపల్లిగూడూరు : వరిసాగులో రైతులకు తీవ్ర నష్టం కలిగించే దోమపోటుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్ సూచించారు. మండలంలోని చిన్నచెరుకూరు గ్రామంలో వరి పొలాలను ఆయన గురువారం సందర్శించారు. ఈ క్రమంలో పొలాల్లో దోమపోటు ఉన్నట్లు గుర్తించి రైతులకు పలు సూచనలు చేశారు. నత్రజని ఎరువులను అధికంగా వినియోగించడం, పొలంలో కాలిబాటలు లేకపోవడం, సింథటిక్స్ పైరిత్రాయిడ్స్ వాడడం దోమపోటుకు కారణమని తెలిపారు. దీని నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో మండల ఏఓ శిరీషారాణి, వరి శాస్త్రవేత్త డాక్టర్ పరమశివ, ఏఈఓ ప్రసన్న, గ్రామ సహాయకులు శివకుమార్, సుమంత్, వినీల్, షర్మిల, పలువురు రైతులు పాల్గొన్నారు.

కూరగాయలతో ఆరోగ్య సిరి

• వ్యాధుల కాలంలో ఆరోగ్య నియమాలు తప్పనిసరి
• తాజా పండ్లు, ఆకుకూరల వినియోగంతో రోగ నిరోధక శక్తి
• వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ఎంతో ముఖ్యం



తాజా కూరగాయలు

కోవూరు : ప్రస్తుత ఫాస్ట్ ఫుడ్ కాలంలో ఆరోగ్య నియమాలు ఎంతో ముఖ్యం. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించకపోవడం, సరైన ఆహారపు అలవాట్లు లేకపోవడం, వ్యాయామానికి దూరంగా ఉండడం వల్లే పలువురు వ్యాధుల బారిన పడుతున్నారు. పైగా వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటే మేలు అని వైద్యులు సూచిస్తున్నారు.

నీరు, పాలకు ప్రాధాన్యం ఇవ్వాలి

పరిశుభ్రమైన నీటినే తాగాలి. సరిపడా నీరు తాగితే 50 శాతం రుగ్మతలు దూరమవుతాయి. ఎక్కువగా కాచి చల్లార్చిన నీటినే తీసుకోవాలి. నీటితో పాటు పాలు కూడా చాలా అవసరం. రోజుకు 250 మిల్లీలీటర్ల పాలు తాగాలి. కాఫీ, టీ అలవాటు ఉన్నవారు రోజుకు ఒకటి, రెండు సార్లు కంటే ఎక్కువ తీసుకోరాదు. ఆహారంలో పల్లీలు, మినుములు, బాదం పప్పు వంటివి ఏదో ఒకటి ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతిరోజు ఏదో ఒక ఆకుకూర 100 గ్రాములు ఉండేలా చూసుకోవాలి. జామ, నిమ్మ, ఉసిరి ఏదో ఒక దానిని తప్పకుండా తీసుకోవాలి. రోజూ ఉడికించిన గుడ్డు, వారంలో ఒకసారి చికెన్, మటన్, రొయ్యలు వంటివి స్వల్పంగా తినాలి. భోజనానికి ముందు, తర్వాత తప్పనిసరిగా సబ్బుతో చేతులను శుభ్రం చేసుకోవాలి. రోజువారీ ఆహారంలో తాజా కూరలు, కూరగాయలు, పండ్లు ఉండేలా చూసుకోవాలి. కూరగాయలు, పండ్లలో ఉండే సూక్ష్మ పోషక పదార్థాలు, ఫైబర్ శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. పసుపు, నారింజ రంగులో ఉండే పండ్లు కొన్నిరకాల దీర్ఘకాలిక జబ్బులను నిరోధిస్తాయి. తాజాగా ఉండే పచ్చి కూరగాయలు, పండ్లను జ్యూస్ రూపంలో కూడా తీసుకోవచ్చు.

వీటికి దూరంగా ఉండాలి

నిల్వ చేసిన ఆహారం, తీపి పదార్థాలు తీసుకోకూడదు. బయట దొరికే రెడీమేడ్ ఆహారం, కూల్‌డ్రింక్స్, ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు తీసుకోకపోవడం ఉత్తమం.

రోజువారీ ఆహారం ఇలా..

ఉదయం రెండు ఇడ్లీలు లేదా 60 గ్రాముల గింజ ధాన్యాలు లేదా 25 గ్రాముల పప్పులు, 150 మిల్లీలీటర్ల పాలు తీసుకోవచ్చు. ఉదయం 11 గంటల సమయంలో ఏదో ఒక పండు, నిమ్మరసం లేదా జామకాయను తీసుకోవాలి. ఇవి అందుబాటులో లేకుంటే ఒక గ్లాసు పాలైనా తాగాలి. మధ్యాహ్నం భోజనంలో 75 గ్రాముల గింజ ధాన్యాలు, ఆకు కూరలు, పెరుగు ఉండేలా చూసుకోవాలి. సాయంత్రం 5 గంటలకు 50 గ్రాముల గింజ ధాన్యాలతో చిరుతిండి, ఒక కప్పు పాలు తీసుకోవాలి. రాత్రి భోజనంలో రెండు కప్పుల అన్నం. లేదా రెండు చపాతీలు లేదా పుల్కాలు తీసుకోవాలి. ఇవి కాకపోతే వంద గ్రాముల మాంసాహారం ఉండాలి.

జలుబు నివారణకు..

జలుబు, దగ్గు, ఆయాసం వంటి సమస్యల నుంచి ఉపశమనం కోసం మిరియాలు, అల్లం, వెల్లుల్లి బాగా ఉపయోగపడుతాయి. వీటిని అవసరం మేరకు వేడి నీరు, పాలు, టీలో కలుపుకుని తాగితే ఉపశమనం లభిస్తుంది.

మంచి ఆహారంతో ఆరోగ్యం



ఆహారం బాగా ఉడికించి తినాలి. ప్రతిరోజు తీసుకునే ఆహారంలో విటమిన్లు కలిగిన వాటిని తీసుకోవాలి. అలా తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారు. అంధత్వంతో పాటు పిల్లల్లో వాంతులు, విరేచనాలు, తట్టు, శ్వాసకోస సంబంధ వ్యాధులను నివారించేందుకు ఏ విటమిన్ బాగా పనిచేస్తుంది. తోటకూర, మెంతికూర, పాలకూర, క్యారెట్, కెరోటిన్ ఉన్న మునగాకు, మామిడి, బొప్పాయి, గుమ్మడి వంటివి తీసుకోవడం వల్ల శరీరానికి సరిపడా విటమిన్లు అందుతాయి.

– వెంకటచలపతి, వైద్యాధికారి, కోవూరు సీహెచ్‌సీ

సాయినాథునికి విశేష పూజలు



మనుబోలు : మండలంలోని జట్లకొండూరు, మనుబోలు గ్రామాల్లోని సాయిబాబా ఆలయాల్లో గురువారం విశేష పూజలు జరిగాయి. అర్చకులు లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు సాయిబాబా విగ్రహానికి పుష్పాలంకరణ చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం పల్లకిసేవ గావించారు.

• **పొదలకూరు :** పట్టణంలోని శిరిడీ సాయిబాబా మందిరంలో అర్చకులు గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శాశ్వత ఉభయకర్తల గోత్రనామాలతో పూజలు, సాయంత్రం భజనలు, రాత్రి పల్లకిసేవ గావించారు. శేజ్‌హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

12న జెన్‌కో ఎదుట ధర్నా

ముత్తుకూరు : మండలంలోని నేలటూరులో ఉన్న ఏపీజెన్‌కో ప్రాజెక్టు ఎదుట ఈనెల 12వ తేదీన ధర్నా నిర్వహిస్తున్నట్లు సీపీఎం ఒక ప్రకటనలో వెల్లడించింది. యాష్‌పాండ్ కట్టకు గండి పడిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని, రైతులు, పరిసర గ్రామాల పేదలకు నష్టపరిహారం ఇవ్వాలన్న ప్రధాన డిమాండ్‌తో ధర్నా చేస్తున్నట్లు ప్రకటించింది.

పక్కాగా వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు

• ఆర్డీఓ మలోల

వెంకటాచలం : మండలంలోని గొలగమూడిలో కొలువైన భగవాన్ శ్రీవెంకయ్యస్వామి 42వ ఆరాధన మహోత్సవాలు ఘనంగా నిర్వహించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ముందస్తు ఏర్పాట్లు పక్కాగా చేపట్టాలని ఆర్డీఓ మలోల ఆదేశించారు. మండలంలోని గొలగమూడిలో ఉన్న భగవాన్ శ్రీవెంకయ్యస్వామి ఆశ్రమం పరిపాలన కార్యాలయంలో ఆర్డీఓ మలోల గురువారం అధికారులతో సమావేశమై ఈనెల 18 నుంచి 24వ తేదీ వరకు జరుగనున్న వెంకయ్యస్వామి 42వ ఆరాధన మహోత్సవాలకు సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై శాఖల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మలోల మాట్లాడుతూ ఆరాధన మహోత్సవాలకు విచ్చేసే లక్షలాది మంది భక్తులను దృష్టిలో ఉంచుకుని తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. భక్తులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పని



మాట్లాడుతున్న ఆర్డీఓ మలోల

చేయాలని తెలియజేశారు. పోలీస్‌శాఖతో సమన్వయం చేసుకుని గొలగమూడి గ్రామానికి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా బస్సులు నడిపేలా చర్యలు చేపట్టాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్, ఆత్మకూరు బస్టాండ్ నుంచి గొలగమూడి గ్రామం వరకు ప్రత్యేక బస్సులు నడపాలని చెప్పారు. ఆరాధనోత్సవాలు ముగిసేంత వరకు ఎక్కడా పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా పంచాయతీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. భక్తుల దర్శన సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా క్యూలైన్లను ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా రథోత్సవం, తెప్ప మహోత్సవం రోజున పోలీస్, విద్యుత్, అగ్నిమాపక శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉంటుందని చెప్పారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి అత్యవసర మందులతో పాటు అంబులెన్స్ కూడా అందుబాటులో ఉంచాలని వైద్యాధికారులకు సూచించారు. అన్నిశాఖల అధికారులు, సిబ్బంది వారికి కేటాయించిన విధులను బాధ్యతతో నిర్వర్తించి, భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చూడాలని కోరారు. సమావేశంలో ఆశ్రమ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బాలసుబ్రహ్మణ్యం, డీపీఓ సుస్మిత, రవాణాశాఖ అధికారి పూర్ణచంద్రరావు, ఎంపీడీఓ ముజీబున్నీసా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అందుబాటులో ఉంటా



ఎస్ఎంసీ చైర్మన్లను అభినందిస్తున్న మాజీ మంత్రి కాకాణి

• మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : కార్యకర్తలు, నాయకులెవరూ అధైర్యపడొద్దని, గెలుపోటములతో పనిలేకుండా అందరికీ అందుబాటులో ఉంటానని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని పులికల్లు గ్రామ పర్యటన సందర్భంగా కాకాణి గ్రామ నాయకులు, కార్యకర్తలతో గురువారం మాట్లాడారు. ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలో ఉన్న రెండు పాఠశాలల ఎస్ఎంసీ చైర్మన్లుగా ఎన్నికైన వారిని అభినందించారు. పులికల్లు మాజీ ఎంపీటీసీ సభ్యురాలు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ నల్లు పద్మమ్మ-వెంకటేశ్వర్లు కుమారుడి వివాహానికి హాజరై దంపతులను ఆశీర్వదించారు. కాకాణి వెంట నాయకులు వై.పెంచలరెడ్డి, జి.నారాయణరెడ్డి, కోడూరు జనార్దన్‌రెడ్డి, కె.రామిరెడ్డి, యనమల శ్రీనివాసులురెడ్డి తదితరులు ఉన్నారు.

పంచాయతీ పాలనపై అవగాహన ఉండాలి

పొదలకూరు : సర్పంచ్‌లకు పంచాయతీ పాలనపై పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలని ఎంపీడీఓ మహ్మద్‌రఫీ పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మూడురోజుల సర్పంచుల శిక్షణా కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పంచాయతీల్లో అధినేత సర్పంచులేనన్నారు. పాలనపై వారికి అవగాహన ఉంటే ఎలాంటి సమస్యలు తలెత్తవన్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్యం, తాగునీరు, వీధిలైట్ల నిర్వహణ, చెత్తసేకరణలో భాగంగా పొడిచెత్త, తడి చెత్తను సేకరించి వర్మికంపోస్టుగా మార్చడం తెలుసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీలకు వివిధ దశల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు విడుదల అవుతుంటాయన్నారు. వాటి వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చన్నారు. మూడురోజుల పాటు నిర్వహించే శిక్షణా కార్యక్రమంలో సర్పంచులు తెలియని అంశాలను అడిగి తెలుసుకోవచ్చునన్నారు. పంచాయతీ పాలనలో సెక్రటరీలది ముఖ్యభూమికగా పేర్కొన్నారు. సర్పంచ్‌లను ముందుండి నడిపించాల్సిన బాధ్యత సెక్రటరీలదేన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ డి.దుర్గాదొరబాబు పాల్గొన్నారు.



పొదలకూరు : మాట్లాడుతున్న ఎంపీడీఓ మహ్మద్‌రఫీ

పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలి

విడవలూరు : మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని మాస్టర్ ట్రైనర్ హరిప్రసాద్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణా తరగతులను గురువారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ ఉదయ్, పంచాయతీ సెక్రటరీలు, సర్పంచులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యాన్ని మెరుగు పరుచుకోవాలి

కొడవలూరు : సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేసి గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగు పరుచుకోవాలని ఎంపీడీఓ వి.ప్రద్యుమ్నకుమార్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీల పాలన, అభివృద్ధిపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు గురువారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు క్రమం తప్పకుండా చేపట్టాలన్నారు. స్వచ్ఛ గ్రామాల లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. వీధి దీపాలను ఎప్పటికప్పుడు మార్చుతూ అంధకారం లేకుండా చూడాల్సిన బాధ్యత కూడా సర్పంచ్‌లు, కార్యదర్శులదేనన్నారు. చెత్తతో సంపద కేంద్రాలను సక్రమంగా నిర్వహించుకోవడం ద్వారా పంచాయతీల ఆదాయ వనరులను పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వి.డేవిడ్, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



కొడవలూరు : సూచనలిస్తున్న ఎంపీడీఓ ప్రద్యుమ్నకుమార్

వెంకన్నపురంలో ఆగిన ఎన్నిక



• ఒత్తిడి తెచ్చి సభ్యులను గైర్హాజరు చేయించిన టీడీపీ నేత

కొడవలూరు : మండలంలోని వెంకన్నపురం ప్రాథమిక పాఠశాల నిర్వాహక కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నిక నిలిచిపోయింది. ఇక్కడి పాఠశాలలో ఒకటి నుంచి ఐదు తరగతులు ఉండగా, నిబంధనల ప్రకారమే ఒక్కో తరగతి నుంచి ముగ్గురు సభ్యులను గురువారం ఉదయం ఎన్నుకున్నారు. ఐదు తరగతుల నుంచి 15 మంది సభ్యుల ఎంపిక జరిగింది. భోజన విరామం తరువాత మధ్యాహ్నం ఎస్ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకోవాల్సి ఉంది. 15 మంది సభ్యుల్లో తొమ్మిది మంది వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు కావడంతో చైర్మన్, వైస్ చైర్మన్‌లు వారికే దక్కుతాయని భావించిన స్థానిక టీడీపీ నేత మధ్యాహ్నం జరిగే ఎన్నికకు సభ్యులను హాజరు కానివ్వకుండా బెదిరించారని సభ్యులు తెలిపారు. ఎన్నిక నిలిచిన విషయమై ఎంఈఓ జి.వసంతకుమారిని వివరణ కోరగా, సభ్యులు గైర్హాజరైనందున ఎన్నిక వాయిదా వేశామని తెలిపారు.

సన్మానం



కొడవలూరు : మండలంలోని గండవరం జెడ్పీ హైస్కూల్ చైర్‌పర్సన్‌గా ఎంపికైన తోట శిరీష, వైస్ చైర్‌పర్సన్‌గా ఎంపికైన పొట్లూరి నాగమణి, కోఆప్షన్ సభ్యులను గురువారం గ్రామంలో సన్మానించారు. వీరిని మాజీ ఏఎంసీ చైర్మన్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలం మాలకొండయ్య, అబ్దుల్ రషీద్, సర్పంచ్ రాజకుమారి, రాఘవరెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

కంపకర్ర తొలగింపు

పొదలకూరు : మండలంలోని కనుపర్తి-అల్లూర్తి మార్గంలో పంచాయతీ నిర్వాహకులు కంపకర్రను తొలగించారు. ఈనెల 1వ తేదీన రోడ్లను కమ్మేస్తున్న కంపకర్ర శీర్షికతో వార్త ప్రచురితం కావడంతో జిల్లా పంచాయతీ అధికారి సుస్మిత స్పందించారు. వెంటనే కింది స్థాయి అధికారులు, సిబ్బందిని చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. దీంతో కంపకర్రను తొలగించారు.

ప్రశాంతంగా ఎస్ఎంసీ ఎన్నికలు

ముత్తుకూరు : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 57 ప్రాథమిక పాఠశాలలు, 7 యూపీస్కూల్స్, 6 జెడ్పీ హైస్కూల్స్, ఒక గురుకుల పాఠశాలలో హెచ్‌ఎంల ఆధ్వర్యంలో ఎస్ఎంసీ ఎన్నికల ప్రక్రియ జరిగింది. రిజర్వేషన్ల ప్రకారం చైర్మన్, వైస్ చైర్మన్‌లు, కోఆప్షన్ మెంబర్స్, సభ్యులను ఎన్నుకున్నారు. ఓటర్లు పాల్గొన్నప్పటికీ కొన్ని పాఠశాలల్లో ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగాయి. నూతన పాలకవర్గంతో హెచ్‌ఎంలు ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మొదటి సమావేశం నిర్వహించారు.

• **కొడవలూరు :** ఎస్ఎంసీ(పాఠశాలల నిర్వాహక కమిటీ) ఎన్నికలు ప్రశాంతంగా జరగడం హర్షణీయమని ఏఎంఓ సుధీర్ అన్నారు. మండలంలోని నార్తురాజుపాళెం, కొడవలూరు హైస్కూల్స్‌లో గురువారం జరిగిన ఎన్నికలను ఆయన పరిశీలించారు. ఎంపికైన చైర్మన్, వైస్ చైర్మన్, కోఆప్షన్ సభ్యులు పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఎంఈఓ జి.వసంతకుమారి, హెచ్‌ఎం ఓబులేసు ఉన్నారు.

• **తోటపల్లిగూడూరు :** మండలంలో 54 ప్రాథమిక, 8 ప్రాథమికోన్నత, 6 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 42 ప్రాథమిక, 6 ప్రాథమికోన్నత, 4 ఉన్నత పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. మొత్తం 68 పాఠశాలలకు సంబంధించి చైర్మన్, వైస్ చైర్మన్‌తో కలిపి 1,047 మంది సభ్యులను విద్యార్థుల తల్లిదండ్రులైన ఓటర్లు ఎన్నుకున్నారు. ఎంఈఓలు వేణుగోపాల్ రెడ్డి, జయరామ నాయుడు ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు.



ముత్తుకూరు : బ్రహ్మదేవి జెడ్పీ హైస్కూల్‌లో ప్రమాణ స్వీకారం చేస్తున్న ఎస్ఎంసీ కమిటీ

స్వల్ప ఉద్రిక్తతల మధ్య..

పొదలకూరు : మండలంలో స్వల్ప ఉద్రిక్తతల మధ్య పాఠశాల ఎన్నికలు గురువారం ముగిశాయి. మండలంలో మొత్తం 101 పాఠశాలలు ఉండగా ఇందులో 11 జెడ్పీ హైస్కూల్స్, 9 యూపీ స్కూల్స్, 81 పీఎస్‌లు ఉన్నాయి. వీటిలో 88 పాఠశాలలకు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ఏకగ్రీవం అయినట్లు ఎంఈఓ-2 శోభనాద్రి తెలిపారు. పొదలకూరు డీఎన్నార్ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఎన్నికల ప్రక్రియలో కొంత ఉద్రిక్తత నెలకొనగా ఎస్సై రామకృష్ణ వెళ్లి రాజకీయ నాయకులను పాఠశాల ఆవరణలో లేకుండా పంపించి వేయడంతో సద్దుమణిగింది. అమ్మవారిపాళెం పాఠశాల ఎన్నికల కోసం ముందస్తుగా పోలీస్ బందోబస్తును కోరారు. అయితే ఎన్నికలు ప్రశాంతంగానే ముగిశాయి. ఏకగ్రీవం అయిన వాటిలో ప్రాథమిక పాఠశాలలు 72, యూపీ స్కూల్స్ 6, జెడ్పీహైస్కూల్స్ 10 ఉన్నాయి.

పాఠశాల ప్రగతికే ఎస్ఎంసీలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : పాఠశాలలను ప్రగతి పథంలో నడపడానికి పాఠశాల నిర్వహణ కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఎంఈఓలు ఎం.దిలీప్‌కుమార్, పీవీ రత్నం అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని 69 పాఠశాలల్లో గురువారం ఎస్ఎంసీ ఎన్నికలు పూర్తయ్యాయని తెలిపారు. అన్ని పాఠశాలల్లో ఏర్పడిన కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌ల చేత ప్రమాణ స్వీకారం చేశారన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రథమ సమావేశాన్ని ఏర్పాటు చేసి ఎక్స్ అఫిషియో సభ్యులు ఆరుగురిని, కోఆప్టెడ్ సభ్యులు ఇద్దరని ఎన్నుకున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో గండికోట సుధీర్‌కుమార్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



తోటపల్లిగూడూరు : కోడూరు గురుకుల పాఠశాలలో..



కొడవలూరు హైస్కూల్‌లో ఎన్నికల ప్రక్రియ పరిశీలన



పొదలకూరు : తోడేరు హైస్కూల్లో యస్దానితో ప్రమాణం చేయిస్తున్న ఉపాధ్యాయులు